క్లుప్తంగా

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రంజిత్, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంతకల్లుటౌన్: డోన్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది దామోదర్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణ, చెన్నకేశవులు, రజబ్‌వలి, పెద్ద తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, విద్యాసాగర్, ఈదుర్‌వలి, బడేసాబ్, సురేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే సందడి

గుంతకల్లుటౌన్: స్థానిక శ్రీవివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎంబీఏ కాలేజీలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ మంజునాథ్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ రేణుక మాట్లాడారు. దేశభవిష్యత్తు విద్యార్థుల పైనే ఆధారపడి ఉందన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కారం, సంస్కృతిని అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఓంకారప్ప, డైరెక్టర్ గురురాజ్, ప్రిన్సిపాల్ హనుమాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న బైక్

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో సోమవారం బైక్ ఢీ కొన్న ఘటనలో శ్రీనివాసులు అనే వ్యక్తి గాయపడ్డాడు. యాడికికి చెందిన శ్రీనివాసులు పని మీద గుత్తికి వచ్చాడు. తాడిపత్రి రోడ్డులో రోడ్డు దాటుతుండగా గుత్తి నుంచి కొత్తపేట వైపు వెళుతున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులును స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుంతకల్లు: స్థానిక బీరప్ప గుడి సర్కిల్ వద్ద ఓ దుకాణంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బోయ ఈరమ్మ అనే మహిళను అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం పోలీసులు దాడులు నిర్వహించగా.. బీరప్ప గుడి సర్కిల్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఈరమ్మ వద్ద 30 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో సురేష్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తాడిపత్రి టౌన్ : స్థానిక కాల్వగడ్డ వీధికి చెందిన పేద యువతి వివాహానికి దూదేకుల సేవా సంఘ నాయకులు రూ.41 వేలు ఆర్థిక సాయం సోమవారం చేశారు. యువతి తల్లి షాహిదాబీకి నగదును ఇచ్చినట్లు దూదేకుల సేవా సంఘ అధ్యక్షుడు నబీరసూల్ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ హుస్సేన్‌పీరా, కోశాధికారి బాబయ్య, సభ్యులు దస్తగిరి, బీవీ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల చోరీ

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి గ్రామానికి చెందిన రైతు పృథ్వీకృష్ణకు చెందిన డ్రిప్ పైపులు, టార్పాలిన్లు సోమవారం చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పృథ్వీకృష్ణ పంటకు నీరు పెట్టేందుకు డ్రిప్ పైపులను కొనుగోలు చేసి తోటలో అమర్చాడు. అదే విధంగా పంట ఉత్పత్తులు వర్షం, ఎండ నుంచి రక్షించేందుకు నాలుగు టార్పాలిన్లు తోట వద్ద ఉంచాడు. అయితే సోమవారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చోరీ చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతు వెంటనే గుత్తిలోని గుజరీలలో గాలించాడు. పట్టణంలోని ఓ గుజరీలో డ్రిప్ పైపులు, టార్పాలిన్లు ఉండటాన్ని గమనించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

పెద్దపప్పూరు: గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు ఇప్పటికే అందాయన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వర్తింపజేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ పప్పక కళావతి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి తెలిపారు.

'వ్యకాసం' మహాసభను విజయవంతం చేయండి

శింగనమల: వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సోమవారం శింగనమలలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభల సందర్భంగా సీపీఎం పతాకాన్ని ఎగురవేశారు.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

- రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న ముఖ్యమంత్రి. స్వాతంత్య్రం వచ్చిన తరువాత ప్రజల కోసం ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. ప్రజాసేవే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదలకు అండగా ఉన్నారు'. అని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎగువపల్లిలో వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 54 వేల పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పేదల ఆరోగ్యం, చదువు విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతినెలా పింఛన్ల కోసం రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు గత ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. టీడీపీ చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అయిందని, ఆ పార్టీ నేతలే ఇదేం ఖర్మ అని అసంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రజల నమ్మకాన్ని చూరగొనడం అత్యంత ముఖ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ ఒక్క పేజీలో మేనిఫెస్టో తయారు చేసి ఇప్పటికే 98.44 శాతం హామీలు అమలు చేశారని చెప్పారు. ఈనెల 20 నుంచి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ సమష్టిగా కృషి చేసి 175 స్థానాలకు 175 స్థానాలు గెలిచి మళ్లీ వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

గృహసారథులు ప్రభుత్వానికి వారధులు

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ప్రభుత్వానికి వారధులుగా సేవలు అందిస్తున్నారని శింగనమల నియోజకవర్గ పరిశీలకులు రాజారెడ్డి అన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయా? లేదా? అని ఇంటింటికీ వెళ్లి ఆరా తీసి సమస్య ఉంటే పరిష్కరించాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, రవి, మాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

- రూ.15,496 రికవరీకి ఆదేశం



పనుల వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల పరిశీలన పూర్తయిన నేపథ్యంలో సోమవారం గుత్తి ఏపీడీ కార్యాలయంలో ఎంపీడీఓ జాషువా, ఏపీఓ సాలయ్య ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో గుంతకల్లు మండలంలోని 25 పంచాయతీలను కలుపుకుని ఉపాధిహామీ పథకం కింద రూ.11.54 కోట్లు, మెటీరియల్ రూపంలో మరో రూ.7.25 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించే క్రమంలో భాగంగా 15వ విడత సామాజిక తనిఖీలను చేపట్టారు. ఎస్‌ఆర్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 6 మంది డీఆర్పీలు ఈనెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, అనంతరం రికార్డులను సరిచూశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, వారి పరిశీలనలోని అంశాలను గ్రామస్తులకు వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయం కాకుండా గుత్తి ఏపీడీ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి , జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎస్టీఎం సత్యనారాయణ, ఏపీడీ విజయ్‌కుమార్‌ల బృందం ప్రజా వేదిక కార్యక్రమంలో అన్ని రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో చిన్న చిన్న తప్పులు చేసిన కారణంగా 10 ఫీల్డ్ అసిస్టెంట్లకు కలిపి రూ. 13 వేలు జరిమానా విధించారు. మండలంలోని మొలకలపెంట, జీ.కొట్టాల, కసాపురం, దోసలుడుకి, కొంగనపల్లి, గుండాల, దోనిముక్కల, నక్కనదొడ్డి, తిమ్మాపురం, నెలగొండ, పాతకొత్తచెరువు పంచాయతీల నుంచి రూ.15,496 రికవరీకి ఆదేశించారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

గుత్తి రూరల్: గుత్తి పట్టణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రజాపురం గ్రామంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుత్తిలో భారతీయ రైల్వేకే తలమానికంగా ఉన్న డీజిల్ లోకో షెడ్, అనేక రైల్వే ఆస్తులు, రెండు జాతీయ రహదారులు, బీపీసీఎల్ పెట్రోలియం డిపో, పవర్ గ్రిడ్ ఉన్నాయన్నారు. అనుకోని సంఘటనలు జరిగి అగ్ని ప్రమాదం జరిగితే కోట్ల ఆస్తులు కాలి బూడిద అవుతాయన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో కూడా అనేక అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయన్నారు. గుత్తి ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత 30 ఏళ్ల నుంచి గుత్తి ప్రజలు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. అయితే తాజాగా ప్రభుత్వం ఫైర్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తూ ప్రతిపాదనల జాబితాను విడుదల చేసిందన్నారు. గుత్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, కలెక్టర్, జిల్లా ఫైర్ అధికారులకు వినతి పత్రాలను ఇచ్చామన్నారు. ప్రభుత్వం స్పందించి గుత్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు జ్ఞానేశ్వర్, సాయికుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

శంభో శంకరా.. బుగ్గరామలింగేశ్వరా!

- అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 13 నుంచి 23 వరకు రోజుకో అలంకరణ

తాడిపత్రి టౌన్: దక్షిణ కాశీగా పిలువబడే ప్రాచీన ప్రసిద్ధ బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతీ సమేత శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కైలాస వాస .. శంభోశంకర.. ఓం నమ శివాయ అంటూ ఆలయ అర్చకులు ఆగమ శైవాగమ శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సోమవారం నుంచి ఈనెల 23 వరకు 11 రోజులపాటు రోజుకో అలంకరణలో పార్వతీ దేవి సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మొదటి రోజైన సోమవారం సాయంత్రం రాజరాజేశ్వరీదేవి, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, శైవ పుణ్యహవాచనం, ఋత్విగ్వరణం, కలశస్థాపన అనంతరం అంకురార్పణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పాలిశెట్టి ఆంజనేయులు, కమిటీ సభ్యులు రాఘవేంద్రారెడ్డి, హరిప్రసాద్, రమేష్ లక్ష్మీదేవి, భగీరథమ్మ, శివమాలధారులు, పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి



మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

18న నాటక ప్రదర్శన

యల్లనూరు: మండలంలోని మేడికుర్తి గ్రామ సమీపంలోని అవధూత బుచ్చమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం రాత్రి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సర్పంచి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై నాటక ప్రదర్శనకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నగేశ్వరాలయంలో అన్నదానం

గుత్తి: పట్టణంలోని కోట ముఖ ద్వారం వద్ద ఉన్న నగరేశ్వరాలయంలో మాఘ మాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని శివ మాలాధారులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు నగరేశ్వరాలయంలో మాఘ మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, హారతి, మహాన్యాస రుద్రాభిషేకం చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 7వ వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణంతో పాటు చెట్టప్పబావి వద్ద పార్క్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు కోరారు. సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. వాల్మీకిసర్కిల్ నుంచి బళ్లారి గేట్ వరకూ రోడ్డు నిర్మించాలన్నారు. అంకాలమ్మ గుడి రోడ్డు విస్తరణ చేపట్టాలని విన్నవించారు. మున్సిపల్ స్థలంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్, నాయకులు రవిబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

తాడిపత్రి టౌన్: స్థానిక అశోక్ పిల్లర్ సమీపంలోని కబరస్తాలో రూ.60వేలు విలువ చేసే ఫ్రీజర్‌బాక్స్‌ను ఫయాజ్ బాషా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా సోమవారం వితరణ చేశారు. కులమతాలకతీతంగా ఫ్రీజర్ బాక్స్‌ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ షాషావలి, వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, యాడికి జామియా మసీద్ ప్రెసిడెంట్ షాషావలి, షకూర్, రియాజ్, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, షఫీ, గురు, బషీర్ షెక్షావలి ఫైజుల్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

గార్లదిన్నె: విద్యుదాఘాతంతో కోడె ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కేశవాపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... కేశవాపురానికి చెందిన దామోదర్ నాయుడు అనే రైతు తమ వరి పొలంలో పొలం దున్నుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రాగానే ఆర్త్ ఫెయిల్ కావడంతో ప్రమాదవశాత్తూ ఎద్దుకు విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే చనిపోయిందన్నారు. అయితే దామోదర్ నాయుడుకు కూడా విద్యుత్ షాక్‌తో పక్కకు పడడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారన్నారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పశువైద్యాధికారి ఆంజనేయులు ఎద్దుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఎద్దు మృతితో రూ.లక్ష నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు దామోదర్‌నాయుడు కోరారు.

రైలు కిందపడి యువకుడి మృతి



గుంతకల్లు: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన మేరకు.. గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలోని కల్లూరు మార్గంలో పట్టాలపై సోమవారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. రైలు దూసుకెళ్లడంతో పట్టాలపై శరీరం రెండు భాగాలుగా విడిపోయింది. దీంతో ఉద్దేశపూర్వకంగానే మృతుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు, చామనఛాయ రంగులో ఉన్న యువకుడు, నల్లరంగుపై తెల్ల గీతలున్న టీ షర్ట్, లైట్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే గుంతకల్లు రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర కోరారు.

యంత్రపరికరాల యూనిట్లు మంజూరు

యాడికి: రైతుల గ్రూపులకు నలభై శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు అందజేయనున్నట్లు ఏఓ మహబూబ్ బాషా సోమవారం తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.15లక్షల వరకు పరికరాలు అందజేస్తామన్నారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంకు లోన్‌తో దఫాల వారీగా చెల్లించొచ్చన్నారు. మండలంలోని 11ఆర్బీకేల్లో 6 ఆర్బీకేల పరిధిలో యాంత్రీకరణ యూనిట్లను ఇప్పటికే అందించామన్నారు. వుప్పాల, నగరూరు, రాయలచెరువు, వేములపాడు, కోనుప్పలపాడు గ్రామాల్లోని రైతు గ్రూపులు యాంత్రీకరణ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కోరారు.

పేద విద్యార్థులను ప్రోత్సహిస్తాం

గుంతకల్లు రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించడమే రాజ్ ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక శంకరానంద గిరీ డిగ్రీ కళాశాలలో రాజ్ ఫౌండేషన్ వారు సమావేశం నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవరెడ్డి మాట్లాడుతూ.. తన కుమారుడి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఫౌండేషన్ నుంచి ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు. పాఠశాల విద్య మొదలుకుని, ఇంటర్, డిగ్రీలో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, ఇతర అధ్యాపకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే తనయుడి పర్యటన



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సోమవారం పర్యటించారు. పాతకోట, పోరాటకాలనీ, గాంధీకట్ట, వీధుల్లో ఆయన పర్యటించి తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని ఆయా సచివాలయ సెక్రటరీలను ఆదేశించారు.

ఎస్‌బీఐ వద్ద సీపీఐ నిరసన

తాడిపత్రి టౌన్ : కేంద్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ అధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన సీపీఐ నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ప్రధాన మంతి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, నాగరంగయ్య, నాగేంద్ర, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతిలో బ్రిడ్జి పనులు ప్రారంభం

యల్లనూరు: యల్లనూరు చిత్రావతి నదిలో రూ.కోటి 50 లక్షలతో నూతనంగా బ్రిడ్జి పనులను మొదలు పెట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గతంలో పార్నపల్లి రిజర్వాయరుకు నీరు రావడంతో దిగువ ప్రాంతాలకు చిత్రావతి నది నుంచి నీటిని విడుదల చేయడంతో నదిపై వేసిన మట్టి రోడ్డు కోతకు గురైందని తెలిపారు. రెండుసార్లు వేసినప్పటికీ కోతకు గురి కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సమస్యను సీఎం జగన్‌తో పాటు ఉన్నతాధికారులకు వివరించి బ్రిడ్జిని మంజూరు చేయించడంతో రూ.కోటి 50 లక్షలతో బ్రిడ్జి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



జ్ఞానశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉష

గుత్తి: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకెండియర్ బైపీసీ చదువుతున్న జ్ఞానశ్రీ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల అనంతపురంలో సాప్ ఆధ్వర్యంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. సోమవారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఉష, పీడీ సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందన సభ ఏర్పాటు చేసి జ్ఞానశ్రీని అభినందించారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి: మండలంలోని కాలాపురం గ్రామంలోని శ్మశానవాటికలో దట్టంగా పెరిగిన కంపచెట్ల తొలగింపు పనులను సోమవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు ఆధ్వర్యంలో చేపట్టారు. ఇటీవల కంపచెట్లు తొలగించాలని గ్రామస్తులు ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సొంత ఖర్చుతో జేసీబీ ఏర్పాటు చేయించి, కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

తాడిపత్రిటౌన్: స్థానిక కృష్ణాపురం జీరో రోడ్డులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం 3వ తరగతి విద్యార్థులు సాంప్రదాయ వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల చైర్మన్ రవికుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ మహబూబ్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్ జమ్మూకాశ్మీర్ వివిధ రాష్ట్రాలకు సంబంధించిన సాంప్రదాయ వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ రామసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన చీనీ చెట్లు

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురంలో 200 చీనీ చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సోమవారం బాధిత రైతు రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... తమకు ఉన్న 1.50 ఎకరా పొలంలో 400 చీనీ చెట్లు సాగు చేశామన్నారు. అయితే ఆదివారం సాయంత్రం తోట వద్దకు వెళ్లగా 200 చీనీచెట్లు మంటల్లో కాలిపోయినట్లు గుర్తించానన్నారు. చీనీ తోటకు దుండగులు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చిన 200 చీనీ చెట్లు, డ్రిప్పు వైర్లు మంటల్లో కాలిపోయాయన్నారు. దాదాపు రూ.2 లక్షలు ఆర్థిక నష్టం జరిగిందని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

కె.ఊబిచెర్లలో బైక్ చోరీ

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనం సోమవారం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంగారెడ్డి తన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆపి నిద్రించాడు. సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో ఉంచిన వాహనం కనిపించక పోవడంతో గ్రామంలోని బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించాడు. అయితే ఎక్కడా బైక్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి గ్రామంలో విచారణ చేపట్టారు.

నూతన సాంకేతికతను అందించండి

బుక్కరాయసముద్రం: పంటల సాగులో నూతన సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని శాస్త్రవేత్తలకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ముకుందరావు సూచించారు. బీకేఎస్ మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం 41వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక ఫలాలు అందాలన్నారు. 2022లో ప్రతిపాదించిన పరిశోధన ఫలితాలను వివరించారు. 2023–24 సంవత్సరానికి ప్రతిపాదించబోయే పరిశోధనలను ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, రేకులకుంట పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి, రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మలత, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, వెటర్నరీ డైరెక్టర్ మురళి, ఆత్మా పీడీ మద్దిలేటి, రేకులకుంట ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దీప్తి, ఏపీఎంఐపీ పీడీ డైరెక్టర్ నాగరాజు రెడ్డి, ఆదర్శ రైతులు చెన్నారెడ్డి, రాము, నిర్మల నాయక్, గంగమ్మ, రఘురాం , కేవీకే శాస్త్రవేత్తలు సుధారాణి, శశికళ, కిషోర్‌రెడ్డి, మాధవి, చందన ప్రోగ్రాం అసిస్టెంట్ వేణు, రంగల రాయుడు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.